మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడు ఇటీవల స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేద్దామనుకొని ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళ్లి ఓ లింక్‌ను ఓపెన్ చేసి రూ. 74.38 లక్షలు పోగోట్టుకున్నాడు. ఇటీవల విడతల వారీగా రూ. 24 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఓ కాలర్ వెంటనే రూ. 50 లక్షలు కట్టాలని, లేదంటే లైఫ్ రిస్క్‌లో పడుతుందని చెప్పడంతో అప్పు చేసి మరో రూ. 50 లక్షల పెట్టాడు. తీరా మోసపోయానని తెలుసుకుని సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

ఎండపల్లి మండలం గుల్లకోటకు చెందిన ఓ యువకుడి మొబైల్‌కు ఓ లింక్ వచ్చింది. మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు దానిని ఓపెన్ చేశాడు. తదుపరి లింక్ పంపిన వ్యక్తి తరుచుగా ఫోన్ చేస్తూ వచ్చాడు. యువకుడి బ్యాంకు ఖాతాలోకి అతనికి తెలియకుండానే రూ. 1.13 లక్షలు జమ కావడం ఆ తదుపరి డ్రా కూడా అయ్యాయి. ఇటీవల కర్ణాటక గద్దర్ జిల్లాలోని సీఈఎన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమాచారం ఇవ్వాలని, దానికి సంబంధించిన రూ. 1.13 లక్షలు డబ్బులు జమ చేయాలని లేదంటే అరెస్టు చేస్తామని అక్కడి పోలీసులు నోటీసు ఇచ్చి వెళ్లడంతో ఖంగు తిన్నాడు.

పెగడపల్లి మండలం దోమల కుంట గ్రామానికి చెందిన ఓ గృహి ణికి గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి తాము ఎయిర్‌టెల్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని నమ్మించి, మీ సెల్‌కు ఒక ఓటీపీ వస్తుంది చెప్ప మని కోరారు. వారి మాటలు నమ్మి ఓటీపీ చెప్పడంతో కొద్ది నిమిషాల్లోనే ఆమె ఖాతా నుంచి రూ. 1,06,100లు మాయం చేయడంతో లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కథలాపూర్ మండలంలోని దుంపెటకు చెందిన ఓ వ్యక్తికి రెండు రోజుల క్రితం వాట్సప్‌లో ఏపీకే ఫైల్ మెసేజ్ రాగా దాన్ని క్లిక్ చేశాడు. దీంతో 20 దఫాలుగా ఖాతా నుంచి రూ. 1,13,804లు గుర్తు తెలియని వ్య క్తి ఖాతాకు బదిలీ జరిగింది. మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.



సైబర్ వలలో విలవిల

- పంథా మారుస్తున్న నేరగాళ్లు
- పెట్టుబడుల పేరుతో కొత్త దందా
- ఉద్యోగులు, డాక్టర్లు, విద్యా వంతులు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు లక్ష్యంగా మోసాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోజుకో కొత్త మోసానికి సైబర్ నేరగాళ్లు తెర తీస్తున్నారు. ప్రజల్లో అవగాహన పెరిగిన సైబర్ నేరగాళ్లు ఎప్పటిక ప్పుడు సరికొత్త పంథాలో వల వేస్తున్నారు. అసలీలను తలదన్నే విధంగా నకిలీ వెబ్‌సైట్ లింకులను పంపుతున్నారు. వాటిపై క్లిక్ చేసిన తర్వాత ఆ న్‌లైన్ పేమెంట్ పేరిట బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలు సేకరించి అం దినకాడికి సొమ్ము కొల్లగొడుతున్నారు. ఉద్యోగులను, విద్యావంతులను, వైద్యులను టార్గెట్ చేస్తున్నారు. అధిక లాభాల పేరుతో బురిడీ కొట్టించి ఒక్కొక్కరితో సాధ్యమైతే భారీగా పెట్టుబడి పెట్టిస్తున్నారు. ఆ డబ్బును వెంటనే క్రిప్టోలోకి మార్చుతున్నారు. ఆ పెట్టుబడికి భారీ లాభం వచ్చిన ట్లు చూపుతున్నారు. ఆ సొమ్మును విత్ డ్రా చేసుకునేందుకు కొత్త టార్గె ట్లు విధిస్తున్నారు. ప్రస్తుత కాలంలో పేమెంట్‌లు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరు గుతున్నాయి. ఈ క్రమంలో నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత ప్రజల అ మాయకత్వాన్ని కాకుండా విద్యావంతులు, ఉద్యోగుల బలహీనతలను ఆస రాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు విసిరే వలలో పడి క్షణాల్లో రూ. లక్షలాది డబ్బులను బాధితులు కోల్పోతున్నారు.

● పంథా మార్చిన సైబర్ నేరగాళ్లు...

గతంలో బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని నమ్మించి ఆధార్ నంబరు, అకౌంట్ నంబర్, పిన్ నంబర్ తెలుసుకొని మోసం చేస్తున్నారు. మీ ఏటీఎం టైం అయిపోందని, కొత్తది తీసుకోవాలని చెప్పి ఫోన్ చేసి బ్యాంకు సమాచారం తీసుకొని ఖాతాలో ఉన్న డబ్బును క్షణాల్లో మాయం చేసే వారు. ఇప్పుడు అంతా స్మార్ట్ ఫోన్లను వినియోగిస్తున్నందున బ్యాంకు ఖాతాలకు ఫోన్ నంబరు లింక్ అవుతోంది. వాట్సాప్‌కు క్యూఆర్‌కోడ్, లింకులు పంపించి మీరు లాటరీ గెలిచారని, ఇంకో విధంగా ఆశ చూపి లింకును ఓపెన్ చేయడంతోనే ఖాతాల్లో ఉన్న డబ్బును దోచుకుంటున్నారు. సైబర్ నేరంలో తెలియక భాగస్వామ్యమయ్యే అమాయక యువతకు కమిషన్ల ఎర చూపి దోచిన డబ్బును అమాయకుల అకౌంట్ల ద్వారా ట్రాన్సక్షన్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

● గంటలోపు ఫిర్యాదు చేస్తే మేలు...

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లుగా గుర్తించిన గంటలోపు ఫిర్యా దు చేయడం వల్ల బాధితులకు మేలు జరుగుతుందని పోలీసులు వివరి స్తున్నారు. ఇటీవల కాలంలో రోజుకో రకం సైబర్ మోసాలు వెలుగు చూ స్తున్నాయని, సులభంగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు మోసాల బాట పడుతున్నారని, ఆన్‌లైన్‌లో అత్యాశకు పోయి డబ్బులు పో గొట్టుకోవడం కంటే అప్రమత్తంగా ఉండడం ముఖ్యమని ప్రచారం చేస్తు న్నారు. మోసానికి గురయిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయా లని, సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలకు వెళ్లకుండా ఫ్రీజ్ చేసే అవకా శాలున్నాయంటున్నారు. తెలియని నంబర్ల నుంచి మెస్సెజ్‌లు, కాల్స్ వచ్చి నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మెస్సెజ్‌లు, స్పామ్ కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేయాలని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలను నియంత్రించడానికి మరింత అవగాహన పెంపొందించుకోవాలి. 1930 కాల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. గతంలో పట్టణాల్లో ఇటువంటి నేరా లు ఉండగా, ప్రస్తుత గ్రామాల్లో సైతం పాకింది. ఆర్గనైజింగ్ క్రైమ్‌గా సైబ ర్ తయారైంది. జిల్లా కేంద్రంలో సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాము. బాధితులకు పలు సందర్భాల్లో వారు పోగొట్టుకు న్న సొమ్మును రికవరీ చేసి అప్పజెప్పుతున్నాము. ప్రస్తుత కాలంలో టెక్నా లజీ పెరుగుదలతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతోంది. మోసానికి గురైన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే మేలు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు

ఎస్పీ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 8 : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం మంచి విద్యార్థి లక్షణం కాదన్నారు.. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్‌లాంటి కేసుల పాలైతే బంగారు భవిష్యత్తును కోల్పో తారన్నారు. వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. సరదాలకు వెళ్లి కష్టాలను కొనితెచ్చుకోవద్దని తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా కష్టపడిచదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తూ దోషులుగా నిలవవద్దని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడేవారి వివరాలను డయల్ 100కు సహాయం పొం దవచ్చని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమైందని అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులు నిర్వహించాలని, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను సిబ్బందిని ఆదేశించారు. యాజమాన్యాలు విద్యార్థుల నడవడికను గమనించాలని కోరారు.

నాలుగు నెలల్లో.. ముగ్గురు మృతి

● ఒకే కుటుంబానికి చెందిన వారి మృతితో విషాదం


మణిదీప్.. శ్రీనివాస్, అరుణ(ఫైల్ ఫొటోస్)

మల్యాల, ఆగస్టు 8: నాలుగు నెలల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం నింపింది. మండలంలోని రామన్నపేటకు చెందిన మాజీ సర్పంచ్ వకుళాభరణం శ్రీనివాస్ గత సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి భార్య మాజీ సర్పంచ్ అరుణ కూడా కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది.. పరిస్థితి విషమించి ఆమె కూడా గురువారం మృతి చెందింది. నాలుగు రోజుల వ్యవధిలో భార్యభర్తలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. నాలుగు నెలల క్రితం వీరి పెద్ద కుమారుడు మణిదీప్ ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనలో ఉన్న తల్లిదండ్రులు శ్రీనివాస్, అరుణ కూడా మృతి చెందడం స్థానికంగా కలచివేస్తోంది.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: జనగామ కోర్టులో న్యాయవాదులపై అక్కడి స్థానిక పోలీసు అధికారుల దాడులను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదులపై పోలీసులు చేసిన దౌర్జన్యాలకు నిరసనగా జిల్లా కోర్టులో గురువారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో జనగామ సీఐ, ఎస్సైల చర్యలు తీసుకోవాలని అలాగే న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భూమి రమణకుమార్, న్యాయవాదులు జనార్ధన్‌రెడ్డి, రాచకొండ శ్రీరాములు, గోవిందుల రాజన్న, వెంకటేశ్వర్ రావు, మదన్‌మోహన్, గంగారాజం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కోరుట్ల : జనగామ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాద దంపతులపై అక్కడి పోలీస్ అధికారులు చేసిన దాడి పట్ల కోరుట్ల బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు గురువారం రెండు రోజుల పాటు విధులను బహిష్కరించారు. దాడులకు పాల్పడ్డ పోలీస్ అధికారులపై కేసు నమోదు చేసి ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీరు శ్రీనివాసరావు, కోశాధికారి రాజశేఖర్, కిషోర్, రాజేంద్ర ప్రసాద్, నవీన్, సురేశ్, సదాశివ్ ఉన్నారు.

బీజేపీ దళిత మోర్చా సభ్యుల శ్రమదానం

రాయికల్, ఆగస్టు 8: రాయికల్ పట్టణంలోని కొమురంభీం రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద వర్షపు నీరు నిలువడంతో బీజేపీ దళిత మోర్చా సభ్యులు గురువారం శ్రమదానం చేసి మట్టిని పూడ్చారు. ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగుతున్నందున శ్రమదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్, ఉపాధ్యక్షుడు మారంపెల్లి శేఖర్, నిగ విజయ్, పాలెపు చందు, కార్యదర్శి బట్టు నాగరాజు, తరుణ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వేడుకల్లో భాగంగా జిల్లాలోని ప్రతి ఒక్క అధికారి వారికి ఇచ్చిన విధులను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను అడిషనల్ ఎస్పీ బీమ్ నాయక్, ఆర్డీవో మధుసూదన్, పలువురు పోలీసు, రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన ఇంటర్ విద్యాధికారి

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె వెంకటేశ్వర్లు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఇంటర్ విద్యాధికారి నారాయణ ఇటీవల జరిగిన బదిలీల్లో కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. దీంతో ఖాళీ అయిన స్థానంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి జిల్లాలోని కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లుకు అదనంగా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వర్లును జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అసోసియేషన్ సభ్యులు, ప్రభుత్వ లెక్చరర్ల సంఘ సభ్యులు, కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మపురి పట్టణానికి శాశ్వతంగా తాగు నీరందిస్తాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


ధర్మపురిలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అడ్లూరి

ధర్మపురి, ఆగస్టు 8: ధర్మపురి పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగు నీరందిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద గల కూరగాయల మార్కెట్‌లో అమృత్ 2.0 ప్యాకేజీ-1 ద్వారా తాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో రూపొందించిన నీటి సరఫరా ప్రాజెక్ట్ సంబంధించిన అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగు నీరిందించేందుకు ఈ పథకం ద్వారా రూ 22 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో చింతామణి చెరువు కూరగాయల మార్కెట్ వద్ద వాటర్ ట్యాంక్, మిషన్ భగీరథ సంపు వద్ద వాటర్ ట్యాంక్, కమలాపూర్ బోల్ చెరువు నుంచి ధర్మపురి వరకు నూతన పైప్ లైన్, ధర్మపురి పట్టణంలో 18 కిలో మీటర్ల నూతన పైపు పైపు లైన్ నిర్మాణ పనులు చేపడతామని అన్నారు. అనంతరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ అర్హులైన 60 మంది లబ్ధిదారులకు మున్సిపల్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించగా వాటికి సంబంధించిన ఓనర్ షిప్ సర్టిఫికెట్లు ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జి ఈఈ సంపత్‌రావు, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు నాగలక్ష్మి, సంతోషి, పద్మ, అరుణ, సయ్యద్ యూనస్, విజయలక్ష్మి సుధాకర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్య క్షుడు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవ స్థాపక అధ్యక్షులు జక్కు రవీం దర్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల మెరిట్ బాధితులకు న్యాయం చేయండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేకు బాధితుల విజ్ఞప్తి


అడ్లూరికి వినతిపత్రం ఇస్తున్న గురుకుల బాధితులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: తెలంగాణ గురుకుల బోర్డు చేపట్టిన ఉపాధ్యాయుల నియామకాల్లో డెసెన్డింగ్ ఆర్డర్ చేపట్టక పోవడం అన్యాయమానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తూ గురుకుల మెరిట్ అభ్యర్థులు గురువారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెసెన్డింగ్ ఆర్డర్ చేపట్టక పోవడం వల్ల పలు నోటిఫికేషన్‌లకు సంబంధించి పోస్టుల క్యాడర్ వేరైనా పేపర్లు ఉమ్మడిగా నిర్వ హించడం వల్ల కొంతమంది అభ్యర్థులకు ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయన్నారు ఆ అభ్యర్థులు ఇతర ఉద్యోగాల్లో చేరకపోవడం వల్ల సుమారు 2500 పోస్టులు భర్తీకాకుండా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.

కావున మిగిలిన పోస్టులకు మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసే విధంగా సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


మొక్కలు నాటుతున్న అతిథులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ కార్యాలయం పరేడ్ మైదానంలో పాల్గొని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ అడువాల జ్యోతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్బన్ పార్కు ఏర్పాటుతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం దొరికిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డికి మౌలికవసతుల కోసం విజ్ఞప్తి చేయగా నిధులు మంజూరు చేశారన్నారు. పట్టణంలోని పలు చోట్ల పార్కులు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్ర మంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, కమిషనర్ సమ్మయ్య, సీఐ కృష్ణారెడ్డి, ఏవో శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం పోస్టుకార్డు ఉద్యమం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: మూడేళ్లుగా ప్రభుత్వం స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో జగిత్యాల ప్రాంత విద్యార్థులు వినూత్న రీతిలో పోస్టుకార్డు ఉద్యమం ద్వారా తమ విజ్ఞప్తిని సీఎం రేవంత్ రెడ్డికి తెలి యజేశారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు విడుదల చేయక పోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని పరీక్ష ఫీజులు, బస్‌పాస్‌లు, రికార్డు బుక్స్ ఇతర అక డమిక్ ఖర్చులకు తమ పోషకులు డబ్బులు ఇచ్చే పరిస్థితి లేక, ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేయకపో వడంతో చదువుకునేందుకు తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించలేనందునే పోస్టుకార్డు ఉద్యమాన్ని ఎంచుకున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణంలోని రామకృష్ణ, నలంద, శ్రీచైతన్య, ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు'

చిగురుమామిడి,అగస్టు 8: బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తిమ్మాపూర్ సిఐ అన్నారు. గురువారం మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై అయితే 100 నెంబర్ కాల్ చేయాలన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎస్సై బండి రాజశే, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

యువతి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఆగస్టు8: మండలంలోని పోరండ్ల గ్రామంలో ఓ యువతి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి మొగిళి గ్రామంలో హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు మామిడి అఖిల(20) యంఎల్‌టి చదివింది. గురువారం మధ్యాహ్నం అఖిల హోటల్ వద్దకు వచ్చి మధ్యాహ్నం 2గంటల వరకు తల్లితో మాట్లాడి ఇంటికి వెళ్లింది. తరువాత కొద్ది సేపటికి సుమారు 3.30గంటల సమయంలో తల్లి కుతురు అఖిలకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకపోవడంతో తల్లి ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లి చూసే సరిగి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానికులు వచ్చి అఖిలను కిందికి దింపి చూడగా అప్పటికే అఖిల మృతి చెందింది. అయితే తన కూతురు చనిపోయెా ముందు ఒక పుస్తకంలో అంగోతు భరత్, అంగోతు కోటయ్య, అంగోతు విజయలు ఫోన్‌లో వేధింపులకు గురిచేశారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి చేసినందుకుగాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తన చావుకు వారే కారణం అని రాసిందని తెలిపారు. తన కూతురు చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి మొగిళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

ఇంటింటా జ్వర సర్వే

చొప్పదండి, ఆగస్టు 8: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చొప్పదండిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో డెంగ్యూ, మలేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్
మరో ఆరు నెలలు పొడిగింపు

జమ్మికుంట, ఆగస్టు 8: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ శ్రీధర్ గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జమ్మికుంటలో జనవరి 29న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ మొదలైన విషయం తెలిసిందే. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన హాల్టింగ్‌కు అనుకున్న విధంగా ప్రయాణికుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఈ నెల 10వ తేదీ నుంచి హాల్టింగ్‌ను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

వారణాసిలో
వేములవాడ సత్రం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం వేములవాడ ఆధ్వర్యంలో వేములవాడ సత్రం ఏర్పాటు చేసింది. గురువారం వారణాసిలోని ఓ అద్దె భవనంలో సత్రం కమిటీ అధ్యక్షుడు, కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త బుస్సా శ్రీనివాస్ దంపతులచే పూజలు చేసి వేములవాడ సత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సత్రం ఉపాధ్యక్షుడు ఉప్పల రామేశం, బుస్సా దశరథంతో పాటు పలువురు దాతలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుస్సా శ్రీనివాస్ మాట్లాడుతూ 18 డీలక్స్ రూమ్‌లతో ఉన్న అద్దె భవనంలో తాత్కాలికంగా వేములవాడ సత్రంను ప్రారంభించామని, శాశ్వత భవన నిర్మాణం కోసం ఇప్పటికే దాతలు ఇచ్చిన విరాళాలతో స్థలం కొనుగోలు చేశామని, శుక్రవారం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వారణాసి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం చక్కటి వసతితోపాటు తెలంగాణ రుచులతో కూడిన భోజనం కూడా కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుస్సా శ్రీనివాస్ కోరారు.

ఇసుక డంప్ సీజ్

సుల్తానాబాద్, ఆగస్టు 8: మండలంలోని గర్రెపల్లి సమీపంలోగల ఓ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. డంప్ వద్ద ఉన్న దాదాపు ఇరవై ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తరలింపు కానీ, డంప్‌లు కానీ ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్) పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం విడుదల చేశారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 8: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8,816 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 121 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.24టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు అధికారులు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఎస్సారెస్పీలోకి 6,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు వంద క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 3,157 సీట్లను కేటాయించిందని శాతవాహన యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత తెలిపారు. మొత్తం మూడు ఫేజ్‌లకు 15,950 సీట్లు కేటాయించగా 11,848 మంది విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేశారన్నారు. స్పెషల్ ఫేజ్‌లో 3157 సీట్లలో ప్రభుత్వ కళాశాలలో 440మంది విద్యార్థుల సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 451మంది విద్యా ర్థులకు, ప్రైవేటు కళాశాలల్లో 2266 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 8: జగిత్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌కు చెందిన రామస్వామి (54) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు టౌన్ ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు. రామస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై తన ఇంట్లో తాను నిద్రిస్తున్న మంచానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు.

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి, ఆగస్టు 8: గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. నేషనల్ హైవే రోడ్డు పనుల్లో కొంత మార్పులు చేయలని కోరినట్లు తెలిపారు. డివైడర్‌తో పాటు 4 వరుసల రోడ్డు వేయాలన్నారు. అంతకపేట నుండి కొత్తకొం డ వరకు నిర్మాణం చేయనున్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతమైన కన్నారం, గుండిపల్లి, కట్కూర్, కన్నా రం, ప్రాంతలకు సాగునీరు అందించేందుకు ఎర్పాట్లు జరిగెలా కృసి చేయలని కోరినట్లు తెలిపారు. తాము విన్నవించిన అనేక సమస్యలపై మంత్రి సానూ కులంగా స్పందించినారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసి అన్ని గ్రామాల్లో పూర్తిగా అబివృద్ధి పనులు జరిగేలా మంత్రి ప్రత్యేక కృషి చేస్తారని తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల బీజేపీ మండల అద్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, కుట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ జిల్లె అశోక్‌రెడ్డి, చందుపట్ల నాగరాజు, లతో పాటు తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సమావేశమైన నాయకులు

భోజన్నపేటలో కుక్కల దాడి

● నలుగురికి గాయాలు
● నివారణ చర్యలు చేపట్టని అధికారులు

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 8 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో కుక్కల దాడి అధికమవుతోంది. మండలంలోని భోజన్నపేటలో గురువారం నలుగురు వ్యక్తులతో పాటు లేగదూడపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించారు. ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మహిళలు దాడి చేసిన వైనాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఆరుగురు విద్యార్థులకు...

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన విద్యార్థులు మస్కూరి బ్రిటిష, మస్కూరి సహస్ర, ఏర్పుల వరుణ్, మద్దుల వర్షిత్ రెడ్డి, రాగుల రిత్విక, గుండం హనీష్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఆరుబయట హోంవర్క్ చేస్తున్న విద్యార్థులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు దాడి చేసి గాయపరిచినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

11న ఉమ్మడి జిల్లా
మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్బ్యా గణపతి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే మహిళా క్రీడాకారులను ఈనెల 16 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. 2008కి ముందు జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్సుతో జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9849114956 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఆగస్టు8:మండలంలోని రెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా టాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అంబాల రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

● డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 : మద్యం మత్తులో స్నేహితుడినే హత్య చేసిన సంఘటనలో ఇద్దరు నిదితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. గురువారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు తెలిపారు. ఈ మేరకు పూడూర్ గ్రామానికి చెందిన మామిడి కమల్, మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చిలువేరి తిరుపతి మృతుడు కందుల రాజశేఖర్‌తో మద్యం సేవించారు. మద్యం తాగుతున్న సమయంలో పాత గొడవల ప్రస్తావన వచ్చిందన్నారు. అదే సమయంలో రాజశేఖర్‌తో కమల్, తిరుపతి గొడవపడుతు కర్రతో తలపై కొట్టారన్నారు. రాజశేఖర్ అరుస్తుండగా నోటిలో ఇసుక పోసినట్లు డీఎస్పీ వివరించారు. హత్య చేసి సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు గాను మృతుడి స్కూటీ నుంచి పెట్రోలు తీసి కాల్చారన్నారు. నిందితులు ఇద్దరు కరీంనగర్ పారిపోతుండగా పూడూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల వద్ద నుండి రక్తం మరకలు ఉన్న బట్టలు, సెల్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజులో హత్య కేసు చేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రుణమాఫీకి కాంగ్రెస్ కొర్రీలు

● కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 8 : ఎన్నికల ముందు షరతులు లేకుండా రెండు లక్షలలోపు మూడు దఫాల్లో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అమలుకు సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి నేతృత్వంలో గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, కోడిపల్లి గోపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. రుణమాఫీ గురించి గ్రామాల్లోని రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65లక్షల పాస్ బుక్‌లు ఉంటే ఎంత మందికి రుణమాఫీ చేస్తున్నారో తెలిపాలని, అదే విధంగా రైతు భరోసా రూ.15వేలు సంవత్సరంలోపు ఇస్తామన్న హామీ నేరవేర్చకుండా రైతు పసల్ బీమా యోజన, ధాన్యానికి క్వింటాలకు రూ. 500ల బోనస్ ఇవ్వడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి, భోగ గంగాధర్, బొడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ గంగాధర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఏఏఓలు, సబ్ ఇంజనీర్లు ఇతర విద్యుత్ అధికారులతో ఎస్‌ఈ గంగాధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉన్న ప్రతిచోట సిబ్బంది తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సిబ్బంది పనిచేస్తున్నపుడు అన్ని రక్షణ పరికరాలు వాడి, విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా రోజు ఉదయం సెక్షన్ ఆఫీస్ వద్ద పెప్‌టాక్ సమావేశంలో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ప్రతినెల టార్గెట్ ప్రకారం విద్యుత్ బిల్లులు వసూలు చేసి వినియోగదారులకు కావలిసిన అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ సర్వీస్‌లకు కావల్సిన పోల్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సామాగ్రి వెంటనే ఏర్పాటు చేసి సర్వీసులు రిలీజ్ చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్వహణ వివరాలను ఆన్‌లైన్ మొబైల్ ఆప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఇ గంగాధర్

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల వాసి

జగిత్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల జిల్లా వాసి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన వెల్ముల భరత్ పదో తరగతి వరకు గ్రామంలోనే చదివారు. ఇంటర్, డిగ్రీ జగిత్యాలలోని ప్రభుత్వ కళాశాలలో చదివారు. 2015లో న్యాయవిద్యలో పట్టా అందుకొని అదే సంవత్సరం న్యాయవాదిగా హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టాడు. గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘంలో కార్యనిర్వాహక సభ్యునిగా సేవలందించిన భరత్ ప్రస్తుతం హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా భరత్ నియామకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


వెల్ముల భరత్

నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు


ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐలు

సుల్తానాబాద్, ఆగస్టు 8: నాటు సారాయితో పాటు, సారాయి తయారీ కోసం తీసుకువెలుతున్న ఇతర పదార్థాలను పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రాథోడ్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం నిందితుల అరెస్టు చూపుతూ పదిహేను లీటర్ల సారాను, సారా తయారీ కోసం ఉపయోగించే వంద కిలోల బెల్లంను, పది కేజీల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గురునాథ్ మాట్లాడుతూ వీణవంక మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామానికి టాటా ఏసీ వాహనంలో గంట సారయ్య, బండి అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు వీటిని తరలిస్తుండగా తాము వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని వివరించారు. ఈ మేరకు సుల్తానాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె ఎస్ ఎన్ రాజు, సిబ్బంది బీర్బల్, మహేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 8: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కందాల శ్రీనివాస్ (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన నివాసంలో సంపు హౌజ్‌లోని చిన్న మోటర్‌ను మరమ్మతు చేసేందుకు పైకి లాగి మోటర్‌ను అందుకునే సమయంలో ప్రమాదవశాత్తు మోటర్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నవత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య నవత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.


కందాల శ్రీనివాస్(ఫైల్)

పొలంలో పడి వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని మూలసాల గ్రామానికి చెందిన నర్ర సమ్మయ్య (48) అనే రైతు ప్రమాదవశాత్తు పొలంలొ పడి ఊపిరాడక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లి కాలు జారి పొలంలో పడిపోవడంతో మొహం పూర్తిగా బురదలో ఉండటంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన చింతపండు ఝాన్సీరాణి (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా యువతి కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికీ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చింతపండు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: చిట్టుమల్ల శ్రీనివాస్ అనే వ్యాపారవేత్తపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, దూషి స్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడిన కరీంనగర్ వాసవీకాలనీకి చెందిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త చిట్టుమల్ల శ్రీనివాస్‌కు పదేపదే ఫోన్ చేసి బూతులు తిడుతూ, చంపుతానని ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాట్సప్ గ్రూపులలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు అనుమతితో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంభీరావుపేటలో వరుస దొంగతనాలు

గంభీరావుపేట, ఆగస్టు 8: గంభీరావుపేట మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనతో ఉన్నారు. పక్షం రోజులుగా దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏ రోజు ఏ ఇంట్లో దొంగతనం జరుగుతుందో.. తెల్లారితే ఏ ఇల్లు లూటీ అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తాళాలు వేసిన పలు ఇళ్లల్లో ఇటీవల దొంగలు చోరీకి పాల్పడ్డారు. విజయ అనే మహిళ ఇంట్లో తప్ప మిగితా ఇళ్లలో పెద్దగా లూటి జరగలేదు. అయితే విజయ ఇంట్లో బంగారం, వెండి అభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. విజయ ఇంటి ముందే కేజీటూపీజీకి సంబంధించిన సీసీ కెమెరాలు ఉన్నా.. సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఓ కాలనీలో దొంగగా బావిస్తున్న ఓ వ్యక్తి చేతిలో ఇనుప సలాక పట్టుకుని ముసుగు ధరించి వెళుతున్న దృశ్యం అక్కడి సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సీసీ కెమెరా ఫుటేజీ సోషల్ మీడియా వైరల్ అవుతోంది. ఈ దృశ్యం గంభీరావుపేటలోనిదా కాదా ఇంకా స్పష్టం కాలేదు. దొంగలు గంభీరావుపేటలో రాత్రి సమయాల్లో సంచరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కూడ ఎల్లమ్మ కాలనీలో తాళం వేసి ఉన్న శివ అనే వ్యక్తి ఇంటి గోడ దూకారని పోలీస్‌లకు ప్రజలు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్‌లు అక్కడికి చేరుకునే సరికి దొంగలు మరో వైపు పరిగెత్తారని తెలిపారు. నిర్దారణతో పోలీస్‌లు, ప్రజలు కొద్ది దూరం వరకు వెళ్లి వెతికినా దొంగలు దొరకలేదు. ఏదీ ఏమైనా రాత్రి అయిందంటే గంభీరావుపేటలో దొంగల భయం వెంటాడుతోంది. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో మరింత గస్తీ పెంచి, దొంగల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

రైతులు సమష్టిగా
సొసైటీని అభివృద్ధి చేసుకోవాలి

● నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్

చిగురుమామిడి,అగస్టు 8: రైతులు సమష్టిగా సొసైటీని అభివృద్ధి చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గాగిరెడ్డిపల్లి సొసైటీకి ఎఫ్‌పీఓలో మంచి పేరు ఉందన్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నాబార్డ్ నుంచి సహకారం ఉంటుందన్నారు. రైతులకు కావాల్సిన సదుపాయాలు అందిస్తామన్నారు. డాక్టర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు కంపోస్ట్ ఎరువులు వాడాలని అన్నారు. వరి పొలంలో ఎర్ర బొమ్మడి రోగానికి జింకు వాడాలన్నారు.కార్యక్రమంలో సంఘం చైర్మన్ మంద శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'శాస్త్రీయ విజ్ఞానమే దేశ అభివృద్ధికి పునాది'

పెగడపల్లి, ఆగస్టు 8 : శాస్త్రీయ విజ్ఞానమే దేశ అభివృద్ధికి పునాదని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి నదీమ్ హుస్సేన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ-మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశాలపై నరేష్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు సేవించి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ప్రాణాలు పోగొట్టుకోవద్దని అన్నారు. ఈ సందర్భంగా సైన్స్ మ్యాజిక్ షో ద్వారా ఇనుపకత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థిని చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృంచిడం లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నదీమ్ హుస్సేన్, హెచ్‌ఎం శాంతమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల దీక్షకు మద్దతు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: ఆరు రోజులుగా డిమాండ్ల సాధనకోసం జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్షకు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ల సాధనకోసం జర్నలిస్టులు రోడ్డెక్కడం తనను బాధించిందన్నారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తానన్నారు. లక్ష్మణ్‌కుమార్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ, రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరినాగభూషణం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల దీక్షకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ లేఖ ద్వారా తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు సమావేశాలు ఉన్నందున దీక్షకు ప్రత్యక్షంగా హాజరుకాలేకపోతున్నానని తెలిపారు.

డిమాండ్ల పరిష్కారం కోసం ఎమ్మెల్యేకు వినతి

కథలాపూర్, ఆగస్టు 8 :తమ అపరిష్కృత డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు వే ములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. కంప్యూటర్ ఆపరేటర్లను జూనియర్ అసిస్టెంట్‌గా నియమించడంతో పాటు పేస్కేల్ అమలు చేసేలా చూడాలని కోరారు. మా ఉద్యోగుల్లో ఎవరైనా మరణిస్తే కారుణ్య నియామకాల కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు గండిగ మురళి, మౌనిక ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మెట్‌పల్లి , ఆగస్టు 8 (ఇబ్రహీంపట్నం) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ వైద్యులు ఆనంద్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ పాఠశాలకు నితిన్ చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌండ్ సిస్టం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. చదువు తో పాటు ఆట, పాట అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందించి విద్యార్థులను సరైన మార్గంలో తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మార్గం లక్ష్మీ-హన్మండ్లు, ప్రధానోపాధ్యాయులు నారయణ, గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండలాధ్యక్షుడిగా సదానందం

గొల్లపల్లి, ఆగస్టు 8: కాంగ్రెస్ సేవాదళ్ గొల్లపల్లి మండల అధ్యక్షుడిగా దాసరి సదానందం గురువారం ఎన్నికయ్యారు. కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయ నిధి కార్యక్రమం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ధర్మపురి నియోజకర్గ వివిధ మండలాల సేవాదళ్ అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ సేవాదళ్ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ నీలకంటేశ్వర్ ఆధ్వర్యంలో, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు అందె మారుతి బాపూజీ సమక్షంలో ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు చొప్పదండి చంద్రయ్య, గొల్లపల్లి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన దాసారపు సదానందంను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొంద్ర జగన్, ముఖేష్ కన్నా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయికల్, ఆగస్టు 8: రాయికల్ పట్టణంలోని బాధితులకు సుమారు రూ.3 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాపురపు నర్సయ్య, రాయికల్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, ఎద్దండి దివాకర్, మహ్మద్ షాకీర్, రాకేష్ నాయక్, బత్తిని నాగరాజు, పొన్నం శ్రీకాంత్, పాశం భూమయ్య, అశోక్, తుకారం పాల్గొన్నారు.

ఇటిక్యాలలో : మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన స్వర్గం రాజారాంకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.36 వేలు విలువ గల చెక్కును ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ ఆదేశాల మేరకు గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు మరిపెల్లి నారాయణ గౌడ్, నీరటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

రాయికల్, ఆగస్టు 8: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు యాల్ల అమర్‌నాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనంద రావులు అన్నారు. రాయికల్, అల్లీపూర్, ఇటిక్యాల, భూపతిపూర్, కొత్తపేట, మైతాపూర్, కిష్టంపేటలతో పాటు పలు గ్రామాల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని అన్నారు. సీపీఎస్ రద్దుకు కృషి చేయాలని తాట్లవాయి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రమేష్, బొమ్మకంటి రవి కుమార్, జిల్లా నాయకులు కన్నవేణి మల్లారెడ్డి, అంతడుపుల గంగరాజం, గుర్రం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, గాజెంగి రాజేశం, దొంతి సతీష్, ఉషాకోల రాము, అక్కనపెల్లి సతీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన డీఆర్‌డీవో

గొల్లపల్లి, ఆగస్టు 8: మండలంలోని ఇబ్రహీంనగర్ సెక్టార్ పరిధిలో నిరాఘవపట్నం అంగన్‌వాడీ కేంద్రాన్ని డీఆర్‌డీవో రఘువరన్ పరిశీ లించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు శాతం, స్టాక్, వంటను పరిశీలించారు. అలాగే పిల్లల బరువులను, ఎత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గోదావరి వద్ద గదులు మరమ్మతు

ధర్మపురి, ఆగస్టు 8: ధర్మపురి గోదావరి నది వద్ద భక్తులు దుస్తులు మార్పిడి చేసుకునే గదులు గురువారం మరమ్మతు చేయించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని నిత్యం వేలాది మంది భక్తులు గోదావరి నది స్నానాలు చేసేందుకు వస్తుంటారు. భక్తులకు అసౌకర్యం కలుగనీయకుండా ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ గోదావరి నది స్నానఘట్టాల వద్ద గల దుస్తులు మార్పిడి గదులను పర్యవేక్షించారు. అవసరమైన చోట్ల దుస్తులు మార్పిడి గదులు మరమ్మతు పనులు చేయించారు. అదనంగా సౌకర్యాలు కల్పించే విషయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎన్‌సీఈఆర్టీ బృందం



పాఠశాలను సందర్శించిన బృందం సభ్యులు

రాయికల్, ఆగస్టు 8: మండలంలోని భూపతిపూర్ ప్రాథమిక పాఠశాలను ఎన్‌సీఈఆర్‌టీ తెలంగాణ విద్యా ప్రదేశ్ బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేష్, ఎఫ్‌ఐలు సత్యనారాయణ, చిలుక హేమలత, వినోద్ కుమార్‌లు పాఠశాలలో సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా తల్లిదం డ్రుల సమావేశం, 1వ తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయు లతో పలు అంశాలపై చర్చించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత



పెగడపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో



కొడిమ్యాలలో పాఠశాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లావైద్యాధికారి సమియొద్దీన్

జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్

పెగడపల్లి, ఆగస్టు 8 : పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా బావించినపుడే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం సాధించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలంలో గురువారం డీపీవో ఆకస్మికంగా సందర్శించి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం రోడ్డు తదితర పరిసరాలను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్, హైస్కూల్ హెచ్‌ఎం ఉన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం) : ఇంటి పరిసరాలతో పాటు ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో వైద్య సిబ్బందితో కలిసి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎవరికైన జ్వరం వస్తే స్థానిక ఏఎన్‌ఎం ను సంప్రదించాలని సూచించారు. కమిషనర్ మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్‌లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, హెల్త్ సిబ్బంది ముజీబ్, పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి డెంగ్యూ, మలేరియా జ్వరాల నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 6వ వార్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 5వ వార్డులో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్వరీ బేగం, వల్లకొండ మహేష్, మేనేజర్ వెంకటి, వైద్యులు సాబీర్ అహ్మద్, హెచ్‌ఈవో సాగర్ రావు, హెస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్ల : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందు వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. పట్టణంలో గురువారం స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గుంతలను మొరం వేసి పూడ్చారు. వీధి కుక్కల నుంచి కాపాడుకునేలా పలు జాగ్రత్తలు వివరించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు.

కొడిమ్యాల : అమ్మ ఆదర్శ పాఠశాలలో మిగిలిన పనులను వారం లోగా పూర్తి చేయించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చెప్యాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, పారిశుధ్య పనులను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో స్వరూప, ఏపీవో సతీష్, కార్యదర్శి స్వామి ఉన్నారు.

● ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి పరమేశ్వరీ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో బాగంగా గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సి పాల్ లావణ్య, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, కార్యదర్శి వంశీవర్ధన్, పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆధ్వర్యంలో గురువారం గ్రామా పంచాయతీల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మురికి కాలువలను శుభ్రం చేయించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు, ఆశ వర్కర్లు, కారో బార్లు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : డెంగ్యూవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమియొద్దీన్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛధనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని మోతెవాడ పట్టణ ఆరోగ్యకేంద్రంలో వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వాటిపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా, నీటినిల్వలను తొలగించాలన్నారు. ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ దోమవృద్ధి చెందే క్రమాన్ని అరికట్టాలన్నారు.

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మాతా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. గ్రామంలో ఓ మహిళ డెంగ్యూ బారినపడగా వారి ఇంటికి వెళ్లి జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కోరుట్లలో మొక్కలు నాటుతున్న కమిషనర్



మెట్‌పల్లిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది



రాయికల్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 8 : వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గ్రామాల్లో పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులకు సూచించారు. గురువారం మండలం లోని పలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. గ్రామాల్లోని పలువురిని పరామర్శించుకుంటూ అనారోగ్య సమస్యలు ఉన్న వారిని పరిక్షించి వైద్య సూచనలు చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యులు అందుబాటులో ఉంచి ప్రజలకు వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న చిన్న విషయాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలని, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ దోమల నివారణకు ప్రతి నిత్యం పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని, అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో తగినంత మందుల నిల్వలు ఉండేలా చూడాలని వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంటా మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచులు పీసు తిరుపతిరెడ్డి, ఆకుల రాజారెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, నేరెళ్ల రాజాగౌడ్, చౌటుపల్లి అంజయ్య, పుల్ల జగన్‌గౌడ్, డాకూరి వెంకటేష్, మ్యాకల సుదర్శన్, నల్ల తిరుపతిరెడ్డి ఉన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

డెంగీ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

కథలాపూర్, ఆగస్టు 8 : రోజురోజుకూ విజృంభిస్తున్న డెంగీ వ్యాధిని అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతకుంట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడ పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. ముందు జాగ్రత్తలే అసలు మందు అని చెప్పారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు చెత్త, చెదారాన్ని తొలగించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆర్యోగం అని, శిశువు ఎదుగుదలలో తల్లి పాలు ప్రధానమని ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ మోర రోజా సుమన్ అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జగిత్యాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రోజా మాట్లాడుతూ మొదటి మూడు రోజులలో వచ్చే పసుపు రంగు ముర్రు పాలలో అనేక ప్రతిరక్షక కణాలు ఉంటాయని వాటివల్ల సహజ నిరోధకత ఏర్పడి శిశువుకు అనేక ఇన్ఫెక్షన్‌లకు దూరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు సంగీతారాణి, డాక్టర్ శ్రీలత, సుజాతతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న డాక్టర్ మోర రోజా

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



మల్యాలలో నిరసన కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు

మల్యాల, ఆగస్టు 8: గ్రామ పంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని పంచాయతీ సిబ్బంది డిమాండ్ చేశారు. సిబ్బంది పర్మనెంట్, వేతనాల పెంపు కోసం గ్రామాలలో నిర్వహించిన సఫాయి బంద్ కార్యక్రమంలో భాగంగా గురువారం మల్యాల మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పంచాయితీ సిబ్బంది మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, కారోబార్, బిల్ కలెక్టర్, గుమస్తాలను సహాయ కార్యదర్శులుగా నియమించాలని అన్నారు. అలాగే మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి, పంచాయతీ సిబ్బందిని పీఆర్‌సీ పరధిలోకి తీసుకురావాలని కోరారు. గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న సిబ్బందికి నెలల తరబడిగా వేతనాలు అందించడం లేదని వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరెపు మల్లేశం, గసిగంటి శ్రీను, దప్పు రవి, గంగారాం, దేవమ్మ, కాంతవ్వ, శాంతవ్వ, నర్సవ్వ వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు పాల్గొన్నారు

బీర్‌పూర్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలంటు గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఆగస్టు 8నా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ఒక్క రోజు నిర సన కార్యక్రమాన్ని చేపట్టాలని ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఒక్క రోజు నిరసన కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు బేతి లక్ష్మన్, ప్రధానకార్యదర్శి వికాస్, కోశాధికారి నదీమ్, కార్మికులు గంగా రెడ్డి, గంగాధర్, లక్ష్మన్ రమేష్, రమేష్, గోపాల్ పద్మ పాల్గొన్నారు.

కొడిమ్యాల: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఎంపీవో వాసవికి పంచాయతీ కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ కారోబార్లను, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యద ర్శులుగా నియామకం చేయాలని కోరారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తు సిబ్బంది కోసం ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కార్మికులు దేవయ్య, సత్తయ్య, రాజమల్లు ఉన్నారు.

గొల్లపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ రద్దు, వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గొల్లపల్లి మండల గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అలాగే పీఆర్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకోవాలని కోరారు. జీవో నెం.51ను సవరించి, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించనియెడల 48 గంటల నిరసన దీక్షలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మండల సేవాదళ్ కార్యవర్గం

పెగడపల్లి, ఆగస్టు 8 : కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ పెగడపల్లి మండల కార్యవర్గాన్ని నియమిస్తూ సేవాదళ్ జిల్లా ఆర్గనైజర్ అందె మారుతి బాపూజీ గురువారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మండల సేవాదళ్ అధ్యక్షులుగా శ్రీరాం అంజయ్య, కార్యదర్శిగా ఐలేని వంశీదర్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీగా బొడ్డు రమేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు పెగడపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ధరల పట్టికలు డీలర్లు విధిగా ప్రదర్శించాలి

కథలాపూర్, ఆగస్టు 8 : ఎరువుల దుకాణ డీలర్లు విధిగా దుకాణం ముందు ధరల పట్టికలను ప్రదర్శిం చాలని ఏవో యోగిత సూచించారు. గురువారం మండ లంలోని పోతారంలో శ్రీ లక్ష్మీనరసింహా ఎరువుల దుకా ణం తనిఖీ చేయగా అక్కడ ధరల పట్టిక లేకపోవడం పట్ల డీలర్‌ను మందలించారు. గంభీర్‌పూర్, భూషణరావు పేట సింగిల్ విండో సొసైటీలో ఎరువుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పని సరిగా రైతులకు తెలిసే విధంగా ఎరువులు, రసాయనిక మందుల ధరల వివరాలు రాసి ఉంచాలన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు వినతి

కోరుట్ల, ఆగస్టు 8 : పట్టణంలో సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సాయిరామ మందిరం సమీపంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయా లని స్థానిక గౌడ సంఘం సభ్యులు మున్సిపల్ కమీషన ర్‌కు వినతి పత్రం అందించారు. జాతీయ రహదారిని ఆనుకుని మాదాపూర్ రోడ్డులో జంక్షన్ నిర్మిస్తున్నట్లు తెలిసిందని ఆ ప్రాంతంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

అంబలి కేంద్రం ప్రారంభించిన జువ్వాడి

కోరుట్ల, ఆగస్టు 8 : పట్టణంలోని బొంబాయి దవాఖానా ప్రాంతంలో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అంబలి, చల్లని మజ్జిగ కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ అంబలి ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, నయిం, ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అంజిరెడ్డి ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త

కొడిమ్యాల, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని పత్తి, మొక్కజొన్న పంటలను గురువారం కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత, జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. కె మదన్‌మొ హన్‌రెడ్డి మండల వ్యవసాయాధికారిణి పి. జ్యోతితో కలి సి పరిశీలించారు. రైతులతో వారు మాట్లాడుతూ పతిలో రసం పీల్చు పురుగు నివారణకు తీసుకోవాలిసిన పలు జాగ్రత్తలను వివరించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మం జుల, శ్రీనివాస్, గ్రీష్మ, లావణ్య, పలువురు రైతులు ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

ధర్మపురి, ఆగస్టు 8: బంగ్లాదేశ్‌లో హిందువులపైన ఉగ్రవాదులు చేసిన దాడుల్లో పలువురు మృతి చెందడం పట్ల ధర్మపురి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపైన ఉగ్రమూకలు చేస్తున్న మారణకాండ దారుణమన్నారు. మృతులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.